అనుమతి లేకుండా ఇసుక రవాణ చేస్తే చర్యలు

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణ, డంపింగ్ చేసిన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గొల్లగూడలో ఇసుక రీచ్‌లను తహసీల్దార్ రామ్మోహన్, మైనింగ్ ఏడీ గంగాధర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణ చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. అక్రమ రవాణ, నిల్వ చేసే వారిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణ చేస్తున్నట్లు తెలిస్తే డయల్ 100 లేదా పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

నవతెలంగాణ

నమ్మదగ్గ తెలుగు దినపత్రిక

1

ఆదిలాబాద్

బుధవారం | ఫిబ్రవరి 19, 2025 | www.navatelangana.com

వాడి పోతున్న నర్సరీ మొక్కలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ప్రభుత్వం అడవుల విస్తీర్ణం పెంచాలనే ఉద్యేశంతో ప్రారంభించిన జాతీయ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. మండలంలోని తుమ్మగూడ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీలో వివిధ రకాల మొక్కలకు నీరు అందించక, ఉపాధి హామీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మొక్కలు వాడిపోతున్నాయి. ఒక్కో నర్సరీ కనీసం 10వేల మొక్కలు నాటేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ నర్సరీలో మొక్కలు వాడిపోతుండటంతో పెట్టుకున్న లక్ష్యం నీరు గారిపోతోంది.

పంట కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలో పలువురు రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. తమ కంది పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల నిరసనతో మండల కేంద్రంలో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో రైతులతో ఎస్సై దివ్యభారతి మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కెట్‌శాఖ అధికారులతో మాట్లాడి రైతులకు సర్ది చెప్పారు. ఎస్ఐ హామీతో రైతులు తమ నిరసనను విరమించుకున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని తంతోలి గ్రామంలో పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి జోగు రామన్న మంగళవారం పరామర్శించారు. ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి గాయాలపాలైన బార్కుంటి కుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని వారికి ధైర్యాన్నిచ్చారు. అదే గ్రామానికి చెందిన ఓజుల లసుంబాయి మృతి చెందడంతో ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట అప్కం గంగయ్య, కనక రమణ, భూమన్న, నవీన్, రమణ ఉన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిట్ట మధ్యాహ్నం మద్యం సేవించి తీవ్రమైన ఎండలో నడి రోడ్డుపై ఓ వ్యక్తి పడి ఉండటాన్ని ఆసిఫాబాద్ పట్టణ ఎస్ఐ ప్రశాంత్ గమనించారు. వెంటనే కానిస్టేబుళ్ల ప్రేమ్ సింగ్, సందీప్, మహేందర్‌ల సాయంతో అతన్ని నీడలో కూర్చోబెట్టి డీహైడ్రేషన్ కాకుండా అతనికి మంచి నీరు తాగించి మానవత్వం చాటుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎండలను దృష్టిలో పెట్టుకొని జాగ్రతగా ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాగ వీరిని పట్టణ సీఐ రవీందర్, పలువురు అభినందించారు.

పుస్తకం రచించడం అభినందనీయం



నవతెలంగాణ-ఉట్నూర్

బ్రేకింగ్ ఏ స్వెట్ ది పాత్ టు పీక్ ఫిట్నెస్ పుస్తకాన్ని డాక్టర్ అనిత రచించడం అభినందనియమని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్ అన్నారు. పుస్తకాన్ని రచించిన సందర్భంగా మంగళవారం పుస్తక రచయితలలో ఒక్కరైన డాక్టర్ అనితను కాలేజ్ లెక్చరర్లు, సిబ్బంది ఆమెను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అందరికీ ఫిట్ నెస్ అవసరమేనన్నారు. కార్యక్రమంలో ఐక్యు ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ నర్సింగ్ రావు, డాక్టర్ రాణి, ముజీబ్, డాక్టర్ రవీందర్, కరుణాకర్, శ్రీకాంత్, డాక్టర్ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకకు ఓటు వేయాలి

నవతెలంగాణ-భైంసా

బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని భైంసా మండల అధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ ఆకాష్ కోరారు. మంగళవారం భైంసా మండలంలోని వాలేగాం, ఇలేగామ్, కామోల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి, మాట్లాడారు. గ్రామాల్లో పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ఎన్నికల్లో హమీలను విస్మరించిన కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలంటే ప్రశ్నించే గొంతుక ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నాయకత్వంలో భైంసా మండలం నుంచి భారీ మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షురాలని, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు దిగాంబర్, సాయినాథ్ పటేల్, నాయకులు, మాజీ ఎంపీటీసీ సుభాష్, కౌటిక్‌వార్ కృష్ణ, మధుకర్, మహేందర్, రాకేష్, శివప్రసాద్, గణేష్ ముత్యం, వివేకానంద ఉన్నారు.

బ్యాంక్‌లో చొక్కాలు విప్పి రైతుల నిరసన

- హోల్డ్‌లో నగదు, అకౌంట్ పునరుద్ధరించాలి
- బ్యాంక్ మేనేజర్ భరోసాతో నిరసన విరమణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని పంజాబ్‌చౌక్‌లో ఉన్న ఎస్బీఐ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఇద్దరు ఖాతాదారులు చేపట్టిన ఆందోళన చర్చకు దారితీసింది. ఇటీవలే ఓ బ్యాంక్‌లో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే రైతులు నిరసన తెలపడంతో బ్యాంక్ అధికారులు బయాందోళనకు గురయ్యారు. గత కొద్ది రోజులుగా హెూల్డ్‌లో ఉన్న ఖాతాలను పునరుద్ధరించాలని కోరుతూ బ్యాంక్ చుట్టూ ప్రదక్షణలు చేసిన అధికారులు పట్టించుకోకపోవడంతో మంగళవారం బ్యాంక్ కార్యాలయంలోనే చొక్కాలు విప్పి నెలపై బైటాయించి, నిరసన వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన వారిలో భీంపూర్ మండలం వడూర్‌కు చెందిన జిల్లెల మోహన్, ఆదిలాబాద్ రూరల్ తంతోలికి చెందిన నక్క విలాస్, జగదీష్ ఉన్నారు. గత ఏడాది కాలంగా తమ అకౌంట్లను హెూల్డ్‌లో ఉంచడంతో లావాదేవీలు జరుపుకోలేకపోతున్నామని, అకౌంట్లో ఉన్న డబ్బులను ఉపయోగించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై అధికారులతో ఎన్నిసార్లు మొరపెట్టుకున్న కాలయాపన చేస్తున్నారే తప్ప పునరుద్ధరించలేదని వాపోయారు. తమ ఖాతాలో జమ చేసిన డబ్బులను



తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అకౌంట్‌లలో నగదు హోల్డ్ చేశారు..

ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడారు. గతంలో తాము సీసీఐకి విక్రయించిన పత్తికి సంబంధించిన డబ్బులు పోస్టాఫీసులో జమ చేశామన్నారు. కానీ ఆ డబ్బును మేనేజర్ కాజేయడంతో తాము నిలదీయడంతో ఎస్బీఐలోని తమ ఖాతాల్లో తిరిగి జమ చేశాడని తెలిపారు. తమ ఖాతాలోని డబ్బులను వినియోగించుకోకుండా అకౌంట్లను హోల్డ్‌లో ఉంచారని పేర్కొన్నారు. ఇదే విషయం బ్యాంక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పునరుద్ధరించాలని కోరిన ఫలితం లేకుండా పోయిందన్నారు. అందుకే తాము నిరసన తెలుపాల్సిన అవసరం వచ్చిందని వాపోయారు.

త్వరలోనే ఖాతాలను పునరుద్ధరిస్తాం...

ఇదిలా ఉంటే రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న సంబంధిత బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ అక్కడికి చేరుకొని నిరసన తెలిపిన రైతులతో చర్చలు జరిపారు. రైతుల వద్ద నుంచి వివరాలను తెలుసుకొని ఢిల్లీకి పంపించారు. త్వరలో వారి అకౌంట్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వీరి అకౌంట్‌లు ఢిల్లీ బ్యాంకులో హోల్డ్‌లో ఉన్నాయని, వారి ఆదేశాలతో మళ్లీ పునరుద్ధరించబడుతాయని స్పష్టం చేశారు. సైబర్ నేరంతో ముడిపడి ఉన్నందున అధికారులు ఆచితూచి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. త్వరలోనే వీరి ఖాతాలను పునరుద్ధరిస్తామని, ఖాతాదారులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. దీంతో ఆందోళన విరమించారు.

బావను కత్తితో పొడిచి చంపిన బామ్మర్ది

నవతెలంగాణ-తలమడుగు

కుటుంబ కలహాలు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. క్షణికావేశంలో కత్తితో దాడి చేసిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో కలకలం రేపింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన కోకూర్ మహేందర్‌ను అదే గ్రామానికి చెందిన బామ్మర్ది కురుమ అశోక్ కత్తితో దాడి చేసి హతమార్చాడు. మృతుడు మహేందర్ గత 13 సంవత్సరాల కింద తంతోలి గ్రామం నుంచి బ్రతుకుదెరువు కోసం రుయ్యాడి గ్రామమైన అత్తగారింటికి వచ్చి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య నవితతో అనేకసార్లు గొడవపడగా నవిత తమ్ముడు అశోక్ బావ మహేందర్ అక్రమ సంబంధం కలిగి ఉన్నాడనే అనుమానంతో బావ మహేందర్‌ను కత్తితో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందినట్టు రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. కాగా మంగళవారం మృతుడు మహేందర్(40) భార్యను ఆదిలాబాద్ బ్యాంకుకు రమ్మని డబ్బులు లేపి సెల్‌ఫోన్ కొనిస్తానని చెప్పడంతో భార్య నవిత ఆదిలాబాద్‌కు వెళ్లింది. మృతుడు మహేందర్ ఒక్కడే ఆదిలాబాద్ నుంచి రుయ్యాడి రాగా మృతుడి బామ్మర్ది అశోక్ మధ్యన మాట మాట పెరిగి గుండె దగ్గర కత్తితో దాడి చేయగా మహేందర్ అక్కడికక్కడే మరణించాడు. ప్రస్తుతం అశోక్ పరారీలో



ఉన్నాడు. మృతుడికి భార్య కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి తమ్ముడు నవీన్ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసినట్టు రూరల్ సీఐ తెలిపారు. ముందుగా సంఘటన స్థలానికి రూరల్ సీఐ, తాంసి ఎస్సై రాధిక, మావల ఎస్ఐ విష్ణువర్ధన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, హత్యకు గల కారణాలను గ్రామస్తులను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

గ్రంథాలయాలలో వసతుల కల్పనకు కృషి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గ్రంథాలయాలలో పాఠకులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా గ్రంథాలయాల ఇన్‌చార్జి దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో శాఖ గ్రంథాలయాలు ఏర్పాటు చేసి ఆయా గ్రంథాలయాలలో పూర్తి స్థాయిలో వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠకులకు దిన, వార, మాస పత్రికలు, చరిత్ర పుస్తకాలు సమకూర్చాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుండి గ్రంథాలయ సేజ్ వసూలు చేసి గ్రంథాలయ సంస్థ ఖాతాలో జమ చేయాలని సూచించారు. పాఠకులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించాలని, కొనసాగుతున్న గ్రంథాలయాల భవనాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అవసరమైన మరమ్మత్తులు చేపట్టి త్వరగా పూర్తి చేయలని, ఫర్నిచర్‌ను సమకూర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి సరిత, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్, జిల్లా విద్యాధికారి గమానియేల్, విద్య, మున్సిపల్ అధికారులు, లైబ్రేరియన్ సదానందం పాల్గొన్నారు.

గిరిజనుల గుడిసెలు తొలగించిన అటవీ అధికారులు

నవతెలంగాణ-జన్నారం

జన్నారం అటవీ రేంజ్ పరిదిలో గల కొత్తూరుపల్లె గ్రామ సమీపంలోని గోండు గుడా నాయకపుగుడా గ్రామాలలో కంపార్ట్ 308 నెంబర్‌లో గిరిజనులు వేసుకుని నివాసం ఉంటున్న 25 గుడిసెలను మంగళవారం అటవీ శాఖ అధికారులు ట్రాక్టర్లు, జేసీబీలతో తొలగించారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బలవంతంగా బయటకు తీసుకవచ్చి జేసీబీలతో గుడిసెలను కూల్చివేశరని 20 ఏళ్ల నుంచి ఇక్కడే నివాసముంటున్నామని ఇప్పుడు ఎక్కడికి పోతామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. నిలువ నీడ లేకుండా చేశారని గిరిజనులు వాపోయారు. 20 సంవత్సరాలుగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకొని ఉన్నామన్నారు. ఇప్పుడు ఎటువెళ్లాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారులను ఎంత వేడుకున్నా వారు యంత్రాల



సాయంతో మా గుడిసెలను కూల్చేశన్నారు..ఈ విషయంపై జన్నారం ఇన్‌చార్జీ రేంజ్ అధికారి సుస్మారావును సంప్రదించాగా అటవీ భూమిలో అక్రమంగా వేసుకున్న గుడిసెలను తొలగించమని ఎవరిని కూడా ఇబ్బంది పెట్టలేదని తెలిపారు. అటవీ భూములలో ఎవరైనా అక్రమంగా గుడిసెలు వేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..

నైపుణ్య అభివృద్ధి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువత నైపుణ్య అభివృద్ధి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని శ్రీనిధి ఆర్ఎం రాంపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ కార్యాలయంలో గ్రామీణ యువతకు టాస్క్ రీజనల్ మేనేజర్ సాయికృష్ణ ఆధ్వర్యంలో అందించే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మంచి ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామీణ యువతకు శిక్షణ అందించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక కంప్యూటర్ ప్రోగ్రాంలతో పాటు లాంగ్వేజెస్, సాఫ్ట్ స్కిల్స్ ఉపయోగపడుతాయని అన్నారు. మహిళలు అన్ని విధాల ముందుస్థాయిలో నిలవాలని, గ్రామీణ ప్రాంతాల యువతులు పట్టణ ప్రాంతాలకు యువతలకు ధీటుగా అన్ని అన్ని రంగాలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో యువతీ యువకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలంలోని కడ్తాల్‌లో తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు వినియోగంలో భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికావద్దని కోరారు. ఇందులో గ్రామకార్యదర్శి సుమయ తస్కిన్, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు రఘు, నాగరాజు, సుదర్శన్, లక్ష్మణ్, జితేందర్, మాదవి పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి భాగ్యరెడ్డి వర్మ



నవతెలంగాణ-వాంకిడి

అణగారిన వర్గాలకు ఆత్మస్థైర్యం నింపడానికి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో అనేక సంఘ సేవ కార్యక్రమాలను నిర్వహించి, అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా భాగ్యరెడ్డి వర్మ నిలిచారని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బుద్ధ విహార్ లో భాగ్యరెడ్డి వర్మ 86వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా కుల నిర్మూలన కార్యక్రమాలను నిర్వహిస్తూ అనగారిన ప్రజలల్లో ధైర్యాన్ని నింపారని, కుల వివక్షను దృష్టిలో పెట్టుకొని 1915లో బుద్ధ పూర్ణిమ రోజు బౌద్ధమతం స్వీకరించాలన్నారు. అతని సేవలను గుర్తించిన ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో జీవిత చరిత్రను చేర్చిందన్నారు. కార్యక్రమంలో బౌద్ధ సమాజ్ అధ్యక్షుడు కోబ్రాగడే విలాస్, ఉప్రే మనోజ్, ఉప్రే యష్పాల్, కాంగ్రెస్ యువజన అధ్యక్షులు దుర్గం ప్రశాంత్, కిరణ్, రాంటెకె శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-రెబ్బెన

విద్యుత్ మరమ్మత్తుల కారణంగా బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. మరమ్మత్తుల కారణంగా సింగరేణి కాలనీ, మైనారిటీ కాలనిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తపాలాపూర్‌లో ఫైలేరియా వ్యాధి నిర్ధారణకు రక్త పరీక్షలు

నవతెలంగాణ-జన్నారం

ఫైలేరియా(బోదకాలు) వ్యాధి నిర్ధారణ నివారణలో భాగంగా జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి తపాలాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది గ్రామ ప్రజలకు ఫైలేరియా(బోదకాలు) వ్యాధి వ్యాప్తి గురించి తెలియజేసి గ్రామంలో 300 మంది నుండి రక్త నమూనా సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ గుండేటి నాందేవ్, సంతోష్ (ఎంఎల్‌టీఎస్) సూపర్‌వైజర్లు జంగమ్మ, రాంబాబు, హెల్త్ అసిస్టెంట్లు కొల్లూరి కమలాకర్ పోచయ్య, రషీద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనం పైనుండి దూకిన రోగి

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి భవనం మొదటి అంతస్తు నుంచి సోము అనే రోగి దూకిన విషయం మంగళవారం వెలుగు చూసింది. కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామానికి చెందిన సోము అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి భార్యతో గొడవ పడడంతో సోమవారం అతని కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ఆస్పత్రిలో చేర్పించారు. మధ్యాహ్నం ఆస్పత్రి భవనం మొదటి అంతస్థుకు చేరుకొని అక్కడి నుండి కిందికి దూకాడు. ఈ ఘటనలో సోము నుదుటికి, ముక్కు భాగంలో గాయాలు కావడంతో ఆస్పత్రి సిబ్బంది వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

నవతెలంగాణ-కడెం

అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ క్యాంపు కార్యాలయంలో మండల మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేతో మాట్లాడారు. మండల



కేంద్రంలో షాదీఖానా, ఖబ్రస్థాన్, మైనారిటీల సమస్యల కోసం నిధులు కేటాయించాలని కోరారు. వారి సమస్యలకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో జమ మసీద్ మొహమ్మదీయ మసీద్ అధ్యక్షులు వజీర్ ఉర్ రెహమాన్, వాజీద్‌ఖాన్, మహమూద్, షార్ఫుద్దీన్ పాల్గొన్నారు.

ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి

నవతెలంగాణ నిర్మల్‌టౌన్

ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించి వారి మన్నన పొందాలని ఆదిలాబాద్ రీజినల్ డిప్యూటీ ఆర్ఎం ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బస్ డిపోలో ప్రొజెక్టర్ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆదిలాబాద్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎం ప్రవీణ్ కుమార్ హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల్లో నైపుణ్యాన్ని, సృజనాత్మకతను పెంచుకోవడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిపోమేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అందరూ నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని, ఈ తరగతులు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని, ఆమె తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, ఏఈ ఎం.నవీణ్ కుమార్ ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యార్థి దశ నుండే పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-తాంసి

విద్యార్థి దశ నుంచి తమ విజ్ఞానాన్ని వెలికి తీస్తూ, పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని ఆదిలాబాద్ జిల్లా అదనపు ఎస్పీ సురేందర్‌రావు అన్నారు. మంగళవారం కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్, పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఫెయిర్ చిత్రాలను సందర్శించారు. ముందుగా ఆర్ట్ గ్యాలరీని విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. విద్యార్థి ప్రదర్శించిన వివిధ రకాల సైన్స్ స్టాళ్లను గురించి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళల పట్ల అఘాయిత్యాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాధిక, సైబర్ సెక్యూరిటి టీమ్, ప్రధానోపాధ్యాయులు ఆనంద్, ఉపాధ్యాయులు విలాస్‌గౌడ్, కిష్టన్న, తొగరి సురేందర్, శ్రీనివాస్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

హీరాసుక జయంతిని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 23న జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న గోండి ధర్మగురు హీరాసుక జయంతి వేడుకలకు ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జాతీయ నాయకుడు సిడాం రాంకిషన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మెస్రం శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరాసుక దేవస్థాన మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఏడాది జిల్లాలో వివిధ చోట్ల హీరాసుక జయంతి వేడుకలను నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది జిల్లా కేంద్రంలో నిర్వహించేందుకు కుల పెద్దలతో కలిసి నిర్ణయించడం జరిగిందన్నారు. హీరాసుక జయంతి వేడుకల్లో భాగంగా ఉదయం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరాసుక మందిరం ఆవరణలో ఉదయం 10 గంటలకు పూజ కార్యక్రమం, అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా రాంలీలా మైదానానికి తరలి వెళ్లడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు పూసం ఆనంద్‌రావ్, సెడ్మకి సుభాష్, గేడం మాధవ్, కుడ్మేత ప్రకాష్, పూసం రామాకాంత్ ఉన్నారు.

ఆలయ నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని భీమన్న గుట్ట వద్ద నిర్మిస్తున్న శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, శ్రీ జగదాంబదేవి ఆలయ నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకులు డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. దేవాదాయ శాఖ తరపున రూ.50లక్షల నిధులు ఆలయ నిర్మాణాలకు విడుదల చేయాలని విన్నవించారు. ఇందులో మాజీ మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, జాదవ్ సంతోష్ ఉన్నారు.

టీడబ్ల్యూటీయూ డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఐటీడీఏ కార్యాలయంలో టీడబ్ల్యూటీయూ డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవాధ్యక్షులు అశోక్ మాట్లాడారు. గిరిజన ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం టీడబ్ల్యూటీయూ సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపైన ఐటీడీఏ పీఓ స్పందించాలన్నారు. చిన్నచిన్న కారణాలతో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టకుండా చూడాలని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీఆర్టీ ఉపాధ్యాయులు గత ఆరు నెలల నుంచి వేతనాలు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, జాదవ్ శివాజీ, కార్యదర్శి జఘురావు, హనుమంత్ రావు, రవీందర్, చంపావతి పాల్గొన్నారు.

వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-నిర్మల్

కేంద్ర ప్రభుత్వం రైతులను, కార్మికులను, దేశంలోని పేదలను పక్కనపెట్టి కార్పొరేట్ అనుకూల బడ్జెట్ ప్రవేశపెట్టిందని, వామపక్ష పార్టీల నాయకులు కే.రాజన్న, ఎస్ఎన్‌రెడ్డిలు విమర్శించారు. మంగళవారం వామపక్ష పార్టీలు ఇచ్చిన దేశవ్యాప్త నిరసన పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. రైతన్నకి పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని అన్నారు. రుణాలన్నింటిని మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వాటి గురించి కనీసం బడ్జెట్‌లో ఒక్క రూపాయి సైతం కేటాయించకపోవడం దారుణమని విమర్శించారు. ప్రధానంగా దేశవ్యాప్తంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో పరిశ్రమల



రూపకల్పనకు ఉపాధి పెంచే చర్యలు చేపట్టకపోవడం, మరోవైపు కార్పొరేట్లకు అనేక రాయితీలు ప్రకటిస్తూ బడ్జెట్‌ని రూపొందించడం ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాన్ని సూచిస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, ఉపాలి, ఎస్ గంగన్న, వెంకటేష్, మహమూద్, అనంతరావు దుర్గే, పుండలిక్, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24న పట్టణంలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించనున్న జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కోడ్ నియమ నిబంధనల ననుసరించి ఉత్సవాలను జరపాలని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని అన్నారు. నిరంతర కరెంట్ సరఫరా, రెండు రోజుల ముందు నుండే సానిటేషన్ చేయాలని అన్నారు. అదేవిధంగా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ తాగునీరు సౌకర్యం, వైద్యశాఖ ద్వారా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ శాఖ ద్వారా బారికేడింగ్స్, పోలీస్ బందోబస్తు, పార్కింగ్ ప్లేస్ తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి ఆటంకం కలుగకుండా ఉత్సవాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్డీఓ వినోద్ కుమార్, బంజారా ఉత్సవ కమిటీ చైర్మెన్ భీమ్‌రావ్, ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : ఆదిలాబాద్‌లో ఈనెల 24న నిర్వహించే శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఉట్నూర్‌లో ఆవిష్కరించారు. సేవాలాల్ జయంతి వేడుకలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కమిటీ అధ్యక్షులు రాథోడ్ భీమ్‌రావు, నేతావత్ రామ్‌దాస్, మోహన్ నాయక్, రామ్ కిషన్, రాజేష్, అమృత్‌లాల్, అజయ్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : ప్రధాన్ సమాజం ధర్మ గురువు హీరాసుక జయంతిని ఈనెల 23న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు పటేల్ జ్ఞానేశ్వర్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23న జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన హీరాసుక జయంతిని ప్రతి మండలం, వివిధ కాలనీల్లో నుంచి మహిళలు, పురుషులు, సంఘం బాధ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గేడం భారత్, సోయం రాందాస్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

నవతెలంగాణ-నిర్మల్

వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి తాగునీరు, విద్యుత్ వినియోగం, రైతు భరోసా, ఆహార భద్రత కార్డుల పరిశీలన, రబీ సీజన్ సాగు నీరు, ఇతర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన వెంటనే అర్హులైన వారందరికీ అందించే విధంగా చర్యలు



తీసుకుంటున్నామన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ రవీందర్, డీపీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, జాదవ్ కృష్ణ, డీఎస్ఓ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పిల్లల గుండె వ్యాధుల నిర్ధారణ శిబిరానికి స్పందన



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పట్టణంలోని కావేరి చిల్డ్రన్ ఆస్పత్రిలో జరిగిన నిర్మల్ ఐఏపీ, రెయిన్‌బో చిల్డ్రన్ హార్ట్ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత చిన్న పిల్లల గుండె వ్యాధుల నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 105 మంది గుండెకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులను 2డీ ఎకోకార్డియోగ్రాఫి ద్వారా పరీక్షించారు. అందులో 60 మందికి శస్త్ర చికిత్స, నాన్ ఇన్వేసివ్ డివైస్ క్లోజర్ అవసరమున్న పిల్లలకు రెయిన్‌బో చిల్డ్రన్ హార్ట్ ఇనిస్టిట్యూట్ సంబంధిత ఫౌండేషన్స్ వారి ఆర్థిక సాయంతో చికిత్సలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో చిల్డ్రన్ హార్ట్ ఇనిస్టిట్యూట్ చీఫ్ కార్డియాలజిస్ట్ డా.కోనేటి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ పిండ దశలోనే చిన్నారుల గుండె వ్యాధులు, జన్యు పరమైన లోపాల నిర్ధారణ, నివారణ అవసరం చాలా ఉందని అందుకు చిన్న చిన్న పట్టణాలలో కూడా ఫీటల్ మెడిసిన్‌కు సంబంధించిన పరిజ్ఞానాన్ని పరికరాలను అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. నిర్మల్ ఐఏపీ ప్రెసిడెంట్ డా.అప్పాల చక్రధరి మాట్లాడుతూ చిన్నారుల గుండె వ్యాధుల చికిత్సకు అయ్యే వ్యయం సామాన్యులకు అందుబాటులో లేదని, ఈ చికిత్సల వ్యయ బారం తగ్గించాల్సిన లేదా ఉచితంగా అందించాల్సిన బాధ్యత ఎక్కువగా అటు ప్రభుత్వంపైన ఇటు ప్రయివేటు ఆస్పత్రులపై కూడా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిన్న పిల్లల గుండె వ్యాధుల నిపుణులు, చీఫ్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డా.కోనేటి నాగేశ్వర్ రావు, డా.శ్వేత, డా.సంగ్రాం, నిర్మల్ జిల్లా డీఎంహెచ్ఓ డా.కె.రాజేందర్, సీనియర్ పిల్లల వైద్య నిపుణులు డా. అప్పాల చక్రధారి, ఐఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.రమేష్ గడపాలే, అధ్యక్షులు డా.మురళీధర్, డా.పోలిశెట్టి సంతోష్, కావేటి శ్రీకాంత్, డా.కావేటి నాగ రంజని, రెయిన్‌బో, కావేరి చిల్డ్రన్ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- బీసీ అభివృద్ధి అధికారి రాజలింగు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుద్యోగులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి కే.రాజలింగు సూచించారు. పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఆర్ఆర్బీ ఎస్ఎస్సీ బ్యాంకింగ్ నాలుగు నెలల ఫౌండేషన్ ఉచిత శిక్షణను మంగళవారం రాజలింగు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు విద్యార్థులు పట్టుదల క్రమశిక్షణ తీవ్రతవనతో చదువుకుంటూ అందరూ ఉద్యోగాలు సాధించాలని తెలియజేశారు. వీలైనన్ని ఎక్కువ నమూనా పరీక్షలు రాయాలని సూచించారు. ఇది వరకు శిక్షణ తీసుకున్న ఎంతోమంది కొలువులు సాధించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తరగతులకు విధిగా హాజరు కావాలని సూచించారు. వీరికి స్టైఫండ్, బుక్స్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీని లాభాలవైపు తీసుకెళ్లడంతో పాటు ప్రయాణీకులకు నాణ్యమైన సేవలను అందించడంపై సంస్థ దృష్టి సారించిందని ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్ తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతి మంగళవారం ఆర్టీసీ కార్మికులకు నైపుణ్య శిక్షణ అందజేస్తున్నామని వెల్లడించారు. డీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో కార్మికులకు ప్రమాద రహిత డ్రైవింగ్, ప్రయాణీకులతో వ్యవహరించే తీరును ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. అనంతరం సంస్థ పరిరక్షణకు పాటుపడుతామని కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ప్రయాణీలకు మరింత చెరువయ్యేలా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు శిక్షణ ఇస్తున్నామన్నారు. సంస్థలను బలోపేతం చేయడంతో పాటు ప్రయాణీలకు మెరుగైన సేవలను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్మికులు సంస్థ పట్ల అంకితభావంతో ఉండాలని సూచించారు. సంస్థ మనుగడ కార్మికులపైనే ఆధారపడి ఉందని, కార్మికులు కూడా ప్రయాణీకులతో మర్యాదపూర్వకంగా ఉంటూ సంస్థ పట్ల గౌరవాన్ని ఇనుమడింప చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి ఆర్ఎం ప్రవీణ్, డీఎం కల్పన, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన డీఈఓ



నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను మంగళవారం డీఈఓ రామారావు సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులను చదివించడం, విద్య బోధన జరుగుతున్న విధానాన్ని, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను ఆయా సబ్జెక్టులపై పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. పదో తరగతి విద్యార్థులు బాగా చదివి 10 జీపీఏ సాధించి, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాలని సూచించారు. పరీక్షకు పూర్తిస్థాయిలో సన్నద్ధులుగా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ, ఉపాధ్యాయులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేటి బాలలే రేపటి పౌరులు, అన్న సూక్తిని ఆ విద్యార్థులు చేసి చూపించారు. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే రోడ్డులో ఉన్న గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని స్వయంగా వారే చలివేంద్రం ఏర్పాటు చేశారు. మంగళవారం చలివేంద్రం ప్రారంభించి, సామాజిక భాధ్యతను చాటిచెప్పారు. వేసవి కాలంలో కేఆర్కే రోడ్డు గుండా వెళ్లే ప్రజలు ఇబ్బంది పడకూడదని విద్యార్థులు ఆలోచించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, విద్యార్థులు సాయికిరణ్, అర్జున్, అశోక్, కుషల్ ఉన్నారు.

కాల్వ గ్రామాన్ని సందర్శించిన డీపీఓ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ గ్రామాన్ని మంగళవారం డీపీఓ శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. అనంతరం పల్లె ప్రకృతి వనం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. సెగ్రిగేషన్ పనులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. వీరి వెంట ఎంపీఓ గోవర్ధన్ ఉన్నారు.

నేడు జరిగే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బుధవారం నిర్వహించే బైక్ ర్యాలీనీ జయప్రదం చేయాలని శివాజీ సేవా సమితి అధ్యక్షుడు మెడిసెమ్మ రాజు ఒక ప్రకటనలో కోరారు. ఎన్టీఆర్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్‌చౌక్ మీదుగా శివాజీచౌక్ వరకు ఈ ర్యాలీ ఉంటుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. హిందూ బంధువులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పది విద్యార్థులకు ఇంపాక్ట్ అవగాహన సదస్సు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని గుండి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇంపాక్ట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్ వడ్లూరి రాజేష్ (జనకాపూర్ జీవశాస్త్ర ఉపాధ్యాయులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు) పరీక్షల సమయంలో సమయ నిర్వాహణ, లక్ష్యాన్ని సాధించడం జీవశాస్త్రంలో మెలకువలు ఎలా తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే.కవిత, ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ఇగూరపు మల్లేష్, వినయ్ కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో జైలు

నవతెలంగాణ-చింతలమనేపల్లి

మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన వికలాంగురాలిపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి యువరాజు తీర్పు ఇచ్చారు. కౌటాల సీఐ ముత్యం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన వికలాంగురాలుపై గత సంవత్సరం అదే గ్రామానికి చెందిన కామెర శంకర్ లైంగికదాడికి యత్నించాడు. ఆమె వెంటనే బిగ్గరగా కేకలు వేయడంతో నిందితుడు పరిపోయాడు. తనపై దాడి చేసిన వ్యక్తి శంకర అని గుర్తించి బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.9,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ జీవీఎస్ ప్రసాద్ వాదించారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్, ఏఎస్సై, సీడీఓ బాలాజీ ఏఎస్ఐలను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించినట్లు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-కెరమెరి

నేటి సమాజంలో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే గుర్తింపు లభిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎంపీ అస్మత్ అన్నారు. విద్యార్థులు విద్యాదశ నుంచే క్రమశిక్షణతో ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవడానికి అర్హత సాధిస్తారన్నారు. విద్యార్థినులు తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెట్టే విధంగా నడవడిక ఉండాలన్నారు. చెడు మార్గం వైపు ప్రయాణించకుండా రాబోవు యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఉన్నత పదవులు, పేరు ప్రతిష్టలు సంపాదించాలని సూచించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. త్వరలో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాల, అధ్యాపకులకు పేరు తీసుకురావాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా కళాశాల అధ్యాపక బృందం కృషితో ఈ కళాశాలలో అభ్యసించినా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. అనంతరం కళాశాల విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నవీన్ రెడ్డి, శ్రీనివాస్, స్వామి, కుతుబొద్దీన్, కిషోర్, బైరాగి, శ్రీహరి, రాము, సునీల్, సరళ, కౌసల్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోడు భూముల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పోడు భూముల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండపెల్లి గ్రామంలో అటవీ శాఖ అధికారులు రైతుల భూములు స్వాదీనం చేసుకొనే ప్రయత్నం చేస్తుండగా ఆ గ్రామ రైతులు ఎమ్మెల్సీని కలిసి సమస్యను వివరించారు. దీంతో ఎమ్మెల్సీ రైతులతో కలిసి పంట పొలాలకు వెళ్లి అటవీ శాఖ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులకు ఆయన రైతులను ఇబ్బందిపెట్టొద్దని, సర్వే అయ్యేంతవరకు రైతుల భూముల జోలికి వెళ్లొద్దని సూచించారు. త్వరలోనే కేంద్ర మంత్రిని కలిసి సమస్యను వివరించి పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాచకొండ కృష్ణ, సముద్రాల రాజన్న, ఎలుకరి సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని కేస్లాగూడ గ్రామపంచాయతీలో ఎస్ఆర్ఈజీస్ ఎంపీ కోటాలో మంజూరైనా సీసీ రోడ్డు పనులకు బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా మారుమూల గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొర్రం వనస్పతిరావు, పంద్రం యశ్వంత్ రావు పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు మార్చి 8న జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు భవన సముదాయంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులు వచ్చేలా చూడాలని, లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి ఈ నెల 20న పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం సిర్పూర్ కాగజ్‌నగర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనరసింహం కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భవిష్యత్తులో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దాన్ని సాధించే దిశగా ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మళ, ఉపాధ్యాయులు బడె సాహెబ్, గంగాభవానీ, లక్ష్మీ, భారతి, భాగ్యశ్రీ, ఆత్మారాం, ధన్‌రాజ్, కావ్య పాల్గొన్నారు.



నీటి ఎద్దడి లేకుండా ప్రణాళిక సిద్ధం చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-కెరమెరి

వేసవి కాలం సమీపిస్తున్నందున ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళికతో నిరంతరం నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు సాకడ గ్రామపంచాయతీలో పర్యటించి మిషన్ భగీరథ నీటి నాణ్యత, తాగునీటి కోసం తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా తాగునీటిని అందించాలన్నారు. ఈ నేపథ్యంలో నీటి ట్యాంకుల శుభ్రత, పైప్ లైన్ల మరమ్మత్తులను వేగవంతం చేయాలన్నారు. నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా, లీకేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నమూనాను పరిశీలించారు. అర్హులైన పేదలకు గూడు కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హత గల ప్రతి ఒక్కరికి పథకం ఫలాలు అందేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, ఎంపీడీఓ అంజత్ పాషా, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్ రావు, మిషన్ భగీరథ ఏఈ సాయికిరణ్, పంచాయతీ కార్యదర్శులు గణేష్, ఈశ్వర్, అధికారులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : రానున్న వేసవికలంలో ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య లేకుండా కార్యచరణ రూపొందించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం జైనూర్ మండలం దుబ్బగూడ గ్రామపంచాయతీలో పర్యటించి మిషన్ భగీరథ నీటి నాణ్యత, సరఫరాల తదితర వాటిని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచి నూతన మెనూ అమలు చేస్తుందని అదనపు కలెక్టర్ తెలపారు. ఈ క్రమంలో విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, ఎంపీడీఓ, ఎంపీఓ పాల్గొన్నారు.

బస్టాండ్ ఉన్న ప్రయోజనం సున్నా



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో నిర్మించిన బస్టాండ్ ప్రయాణికులకు ఉపయోగకరంగా లేదు. బిచ్చగాళ్లకు నిలయంగా మారింది. ప్రస్తుతం బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే ఎండలో నిలబడాల్సిన పరిస్థితి. ఆర్టీసీ అధికారులు కూడా బస్టాండ్ ఉన్న బస్టాండులోకి బస్సులను అనుమతించడంలేదు. గతంలో నాలుగు వరుసల రహదారి నిర్మించడంతో బస్టాండులోకి బస్సులు కూడా వెళ్లడంలేదు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో బస్‌షెల్టర్ నిర్మించిన అది కూడా అసౌకర్యంగా ఉంది. చిన్నదిగా నిర్మించడంతో అందులో కూర్చోవడానికి ప్రయాణికులకు సరిపోవడం లేదు. అనేకసార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. కనీసం ఎండాకాలంలోనైనా ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెబుతున్నారు. ఈ వేసవికాలంలో వివిధ ప్రాంతాలు, గ్రామాల నుండి ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లోకి బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

20న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభ

- ఎమ్మెల్సీ దండే విఠల్

నవతెలంగాణ-బెజ్జూర్

ఈ నెల 20న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్, పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, మాజీ జడ్పీటీసీ పంద్రం పుష్పలత, మాజీ సర్పంచ్లు కడప విశ్వేశ్వరరావు, ఉమ్మరి లింగయ్య, కాంగ్రెస్ నాయకులు సిరిపురం సదాశివ్, సామల రాజన్న పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలంలోని చేడ్వయి గ్రామంలో పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి, విద్యవేత్త నరేందర్ రెడ్డికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ దండే విఠల్ కోరారు. ఎన్నికల ప్రచారం భాగంగా ఎమ్మెల్సీ దండే విఠల్ ఈనెల 27న జరిగే ఎన్నికల్లో వరుస క్రమంలోనీ 2వ నంబర్ బటన్‌నొక్కి, మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు సముద్రాల రాజన్న, చౌదరి శ్రీనివాస్, సిరిపురం సదశివ్, రాచకొండ కష్ణ, శంకర్ గౌడ్ వెంకటేష్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



కౌటాల : కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని నాయకులు కోరారు. మండల కేంద్రంలో అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి నరేందర్‌రెడ్డికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పట్టభద్రులున్నారు.





ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

బీజేపీ బలపరిచినఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలనీ ఎమ్మెల్సీ ఎన్నికల తాలూకా ఇఇన్ర్జి కొయ్యల ఎమ్మాజి అన్నారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని, పట్టభద్రుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రచారం చేసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుకుడ రాజేశ్వర్, నాయకులు మధుకర్, పురుషోత్తం, సంతోష్, గోపాల్, మహేష్, అంకులు, శ్రీనివాస్, కాంతారావు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలంలోని ఊట్ సారంగపల్లి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఎమ్మాజీ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో ప్రశ్నించే గొంతుకలకు శాసనమండలికి పంపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, సిర్పూర్ అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రా చారి, మాజీ సర్పంచ్ వాసిఉల్లా ఖాన్, మాజీ ఉప సర్పంచ్ సిడం సంతోష్, నాయకులు జాడి దిగంబర్, ఉమ్మెర బాలకృష్ణ, కొప్పుల దిలీప్, కోర్తే తిరపతి, ఎర్ర బాలకిషన్ పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచుకొని ముందుకెళ్లాలి : జీఎం



నవతెలంగాణ-రెబ్బెన

కాగితపు రహిత ఉత్తర, ప్రత్యుత్తరాల సేవలను అమలు లోకి తీసుకువస్తున్న సింగరేణి సంస్థ చర్యలను వేగవంతం చేసింది. పర్యావరణహిత చర్యల్లో భాగంగా కాగితాలకు ప్రత్యామ్నాయంగా వినియోగించే శాప్‌ఫైల్ లైఫ్ సైకిల్‌పై మంగళవారం బెల్లంపల్లి ఏరియా అధికారులకు జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఐటీ విభాగం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలోని పలు రంగాలు, పరిశ్రమలు సాంకేతికతను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి దిశగా దూసుకు పోతున్నాయన్నారు. కాగితపు రహిత ఉత్తర ప్రత్యుత్తరాలలో బెల్లంపల్లి ఏరియా ముందుండాలని అధికారులకు సూచించారు. అధికారుల సందేహాలను కార్పోరేట్ ఐటీ అధికారులు నివృత్తి చేశారు. ఏప్రిల్ నుండి సింగరేణి వ్యాప్తంగా పేపర్ లెస్ ప్రక్రియ అమలు కానుందన్నారు. కార్యక్రమమలో ఎస్ఓటూ జీఎం కె.రాజమల్లు, పీఓ ఎం.నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఐటీ ఇన్‌చార్జి ముజీబ్, కార్పోరేట్ ఐటీ అధికారులు హర ప్రసాద్, కిరణ్ కుమార్, శంకర్, రమ్య పాల్గొన్నారు.

మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం పెట్టాలి



నవతెలంగాణ-కౌటాల

మెరుగైన విద్యతో పాటు నాన్యమైన భోజనం పెట్టాలని ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీపీఎస్ వీరవెల్లి, కౌటీ, సాండ్‌గాం, పార్డీ పాఠశాలలను ఆయన సందర్శించారు, కౌటి పాఠశాలలో సాయికిరణ్, వేణి ఇద్దరు టీచర్లు కృత్యాదార బోధన చేసి విద్యార్థులను ఆకర్షితులను చేయడంతో వారిని అభినందించారు. అదేవిధంగా సాండ్గమ్, పార్డీ పాఠశాలలో మిలింద్, భారతి, రాకేష్, ప్రియాంక, వీరవెల్లి పాఠశాలలో రష్మిక, రామరాజు టీచర్లు విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పిస్తూ విద్యార్థులకు చదువు పట్ల అవగాహన కల్పిస్తున్నారు. వీరిని ఆయన అభినందించారు. అదేవిధంగా ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి విద్యార్థికి అపార్ ఐడీలను క్రియేట్ చేయాలన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు నిత్యం సాధన చేస్తూ భయాందోళనకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుందిళ్ల రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఒత్తిడికి గురి కావొద్దని, ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. సెల్ ఫోన్ ఏ విధంగా వాడాలి సెల్ ఫోన్ వల్ల లాభాలు నష్టాలను వివరించారు. ప్రతి సబ్జెక్టులో ఏ విధంగా నేర్చుకుంటే మంచి మార్కులు సాధించగలరు మెలకువలు నేర్పారు. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి నాగసుధ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న జీఎంకు సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా పని చేసి శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా బదిలీపై వెళ్తున్న ఎం.శ్రీనివాస్‌ను బెల్లంపల్లి ఏరియా అధికారులు మంగళవారం సన్మానించారు. జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఏరియాలో ఆయన సేవలను కొనియాడారు. అనంతరం శాలువాతో సన్మానించి మొక్కను అందజేశారు. కార్యక్రమమలో ఎస్ఓటూ జీఎం కె.రాజమల్లు, పీఓ ఎం.నరేందర్, ఏరియా ఇంజినీర్ రామనాథం, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో..

బెల్లంపల్లి ఏరియాలో జనరల్ మేనేజర్గా పని చేసి శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీపై వెళ్తున్న జీఎంను టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మలరాజ్ శ్రీనివాసరావు. సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ మంగీలాల్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్, అలవేణి సంపత్, సెంట్రల్ నాయకులు గజల్లి చంద్రశేఖర్, ఓరం కిరణ్, మాంతు సమ్మయ్య, ఫిట్ కార్యదర్శి బొంగు వెంకటేష్, గణపతి, కాయిత స్వామి, అనీష్, సురేష్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | ఫిబ్రవరి 19, 2025 | www.navatelangana.com


అనారోగ్యంతో అనాధ వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-మందమర్రి

అనారోగ్యంతో అనాధ వృద్ధురాలు మృతి చెందినట్లు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ 2024 డిసెంబర్ 9వ తేదిన రాత్రి 10 గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మందమర్రి అదనపు ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తున్నప్పుడు మతిస్థిమితం లేని మహిళ కనబడడంతో తన వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నించారు. ఆమెకు సంబంధించిన ఎటువంటి సమాచారం తెలియలేదన్నారు. పట్టణానికి చెందిన అమ్మ స్వచ్ఛంద సంస్థ ద్వారా మంచిర్యాలలోని కల్వరి యువశక్తి అనాథ వృద్ధుల, మానసిక వికలాంగుల ఆశ్రమంలో చేర్పించారు. వృద్ధురాలికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో జనవరి 23వ తేదీన మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం చనిపోయినట్లు వెల్లడించారు. మృతదేహం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ ఉంచారు. వృద్ధురాలి సమాచారం తెలిసిన వారు మందమర్రి ఎస్ఐ 8712656570 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఐఎఫ్ ప్యానల్లను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-జైపూర్



మెరుగైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐ.ఎఫ్ ప్యానల్లను వినియోగించుకోవాలని ఎంఈఓ బి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఇందారం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించేది ఉపాధ్యాయులు మాత్రమే ఈ ఓరెంటేషన్ శిక్షణ బోధనకు ఉపకరిస్తుందని అన్నారు. రాబోవు పదవ తరగతి వార్షిక పరీక్షల దృష్ట్యా విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాసే విధంగా కృషి చేయాలని తెలిపారు. హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్, జైపూర్, భీమారం మండలాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు హాజరు కాగా రామకృష్ణ, ప్రసాద్‌రావు, విఘ్నేష్, రమేష్, కొత్త రమేష్‌బాబు, రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలి : ఖానాపూర్ ఎమ్మెల్యే



నవతెలంగాణ-జన్నారం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపునకు అందరూ కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సూచించారు. మంగళవారం ఆర్ఆర్ఎస్ కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలు సైనికుల పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, నాయకులు ఏనుగు సుభాష్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

ఇస్కాన్ పేరుతో రియల్ దందా సరికాదు



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో సీస్కో ఇన్ఫ్రా డెవలర్స్ వారు ఇస్కాన్ పేరుతో రియల్ దందా చేయడం సరికాదని ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ(ఇస్కాన్) ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు భీమారం పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో మంగళవారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు స్థానిక ఎస్ఐ శ్వేతతో కలిసి మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ లోగోను ముద్రించిన ప్రతులతో సీస్కో ఇన్ఫ్రా డెవలపర్స్ సంస్థ వ్యాపారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధమైన చర్యలకు పాల్పడిన సీస్కో ఇన్ఫ్రా డెవలపర్స్ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ సంస్థ జనరల్ మేనేజర్ హనుమాన్ విజయ దాస పిర్యాదు చేసినట్లు ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

సింగరేణి కార్మికుల పక్షాన పోరాడుతాం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులకు రావలసిన ఉద్యోగోన్నతలపై చర్చలు నిర్వహించినట్లు ఆ సంఘం ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్ కుమార్ తెలిపారు. సింగరేణిలో ఎక్కడైనా కానీ ఒక ఎస్టీ ఉద్యోగస్తుడు, ఒక ఎస్సీ ఉద్యోగస్తుడు కానీ ఎలాంటి సమస్యలు వచ్చిన ముందుంటామని అన్నారు. సింగరేణి కార్మికులకు ఉద్యోగోన్నతులు కల్పించడానికి సహకరించిన సంబంధిత అదికారులకు దన్యవాదాలు తెలిపారు.

క్రమశిక్షణతో చదివితేనే ఉత్తమ ఫలితాలు

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతేనే ఉత్తమ ఫలితాలు సాదిస్తారని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సైకాలజిస్ట్ మోటివేషనల్ స్పీకర్ బాణావత్ ప్రకాష్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆశ్రమ బాలుర పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు తల్లిదండ్రుల పట్ల, విద్యను అందించే గురువుల పట్ల, సమాజం పట్ల భాద్యతలను తెలియజేస్తూ పలు విషయాలపై తగిన సూచనలు చేశారు. ముఖ్యంగా మార్చిలో జరగబోయే ఎస్ఎస్‌సి బోర్డు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, ఒత్తిడిని అధిగమించి పరీక్షలలో మంచి మార్కులు ఎలా పొందాలి వంటి అంశాలపై విద్యార్థులకు సుదీర్ఘంగా సలహాలు అందించారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాథోడ్ గణేష్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- **మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

నవతెలంగాణ-లక్షెట్టిపేట



ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్టు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిని 100 పకడల ఆస్పత్రిగా అభివృద్ధి చేసి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో తీసుకురానున్నట్టు తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ఆస్పత్రికి వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచడం, ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థినీ, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, పాఠశాల పరిసరాలు, రిజిస్టర్లను పరిశీలించి ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం డైట్, కాస్మాటిక్ చార్జీలను పెంచిదని, విద్యార్థులకు నూతన మెను ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని, ప్రత్యేక తరగతుల ద్వారా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం-32ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- **చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్**



నవతెలంగాణ-మందమర్రి

ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ సూచించారు. మంగళవారం సారంగపల్లి గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో చెన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బానోత్ ప్రసాద్, ఉద్యానవన అధికారి కల్యాణి, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై రైతులందరికీ అవగాహన ఉండాలని, తద్వారా పథకాల వినియోగంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ వంటి పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానవన అధికారి కల్యాణి ఆయిల్ పామ్ సాగు, సబ్సిడీ వివరాలు, సూక్ష్మ సేద్య పరికారాలపై సబ్సిడీ, పందిరి కూరగాయల సాగు, ఆయిల్ ఫామ్‌లో అంతర పంటగా కోకోవా సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ వంటి పథకాలపై తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ అధికారి రాజేష్ రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పశు సంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖ, మత్స్య శాఖ, పట్టు పురుగుల పెంపకం, తేనె టీగల పెంపకం అంశాలపై అవగాహన కల్పించారు. రైతులకు కావలసిన సమాచారం కోసం సంబంధిత శాఖల అధికారులతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి వ్యవసాయ శాఖ తోడ్పడుతుందని తెలిపారు. సమావేశంలో పంచాయతి కార్యదర్శి సవ్య, రైతులు కమల మనోహర్, ఫిరోజ్, రాయమల్లు, ఆసంపెల్లి రాజయ్య, ఖలీమ్, గౌస్, ముజఫర్, మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కారొబార్ మధు పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు

- **తాండూర్ సీఐ కుమారస్వామి**

నవతెలంగాణ-తాండూర్



అనుమానస్పందంగా కనిపించే వారికి ఆశ్రయం ఇవ్వొద్దని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. మంగళవారం తాండూర్ సర్కిల్ పరిధిలోని మాదారం పోలీస్‌స్టేషన్ టౌన్షిప్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. తెల్లవారుజామున ఎస్ఐ సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో ధ్రువీకరణ పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలను, 10 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల్లో భద్రత భావన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాములు పల్లెనిద్ర కార్యక్రమాలు చేపట్టి గ్రామాల్లో సమైక్యత భావాన్ని శాంతిభద్రతలను పెంపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహన దారులు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారికి కొత్త చట్టాలలో జరిమానాలు, శిక్షణ కాలాన్ని న్యాయశాఖ పెంచడం జరిగిందనని తెలిపారు. మహిళల భద్రతే పోలీస్ లక్ష్య మని, వారి రక్షణ కోసం షీ టీమ్స్ నిరంతరం పని చేస్తున్నాయన్నారు. యువకులు గుంపులుగా ఏర్పడి బహిరంగ మద్యపానం సేవించిన, ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. వ్యాపార సముదాయాల దగ్గర, కాలనీలలో స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. పోక్సో కేసుల నమోదు, శిక్షలు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ సామాజిక న్యాయ చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

శేఖర్‌రావుకు ప్రయివేటు ఉపాధ్యాయుల మద్దతు



నవతెలంగాణ-జన్నారం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ట్రస్మా ప్రయివేట్, పాఠశాలల సంఘం యాదగిరి శేఖర్ రావుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రయివేట్ విద్యాసంస్థలలో పనిచేసే బోధన బోధనేతర సిబ్బంది సమస్యల కోసం పోరాడే వ్యక్తి, బడ్జెట్ ప్రయివేట్ విద్యా సంస్థల నుంచి బరిలో నిల్చున్న ఏకైక వ్యక్తి యాదగిరి శేఖర్‌రావు అని తెలిపారు. గతంలో కేవలం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి కరోనా కాలంలో ప్రయివేట్ పాఠశాలలలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి రూ.2000 ఆపత్కాల భతి, 25 కేజీల బియ్యం రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడి ఇప్పించిన వ్యక్తి మన యాదగిరి శేఖర్ రావు అని, ఎన్ఐఓఎస్ ద్వారా రాష్ట్రంలో సుమారు లక్ష మందికి పైగా డిస్టెన్సులో డిప్లొమా ఇన్ ఎల్మెంటరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసి టీచర్ ఉద్యోగానికి అర్హత సాధించడానికి కారకుడు యాదగిరి శేఖర్ రావుఅని, అంతేకాకుండా ప్రయివేట్ విద్యాసంస్థలలో ఐటీ మినహాయింపు రూ.కోటి నుంచి రూ.5 కోట్లకు పెరగడానికి కృషిచేసిన వ్యక్తి శ్రీ యాదగిరి శేఖర్ రావు అని అన్నారు. పాఠశాల గుర్తింపు రెన్యువల్ 10 సంవత్సరాలు ఇప్పించిన వ్యక్తి యాదగిరి శేఖర్ రావు అని తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సెప్టెంబర్ 5వ తేదీ రోజు ప్రభుత్వ ఉపాధ్యయులతో పాటు ప్రయివేటు ఉపాధ్యాయులను కూడా ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి వారికి కూడా సన్మానం చేయాలని పోరాడినా వ్యక్తి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శేఖర్‌రావును గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, మండల ప్రధాన కార్యదర్శి కస్తూరి సతీష్ కుమార్, నాయకులు సురేష్, రవీందర్ పాల్గొన్నారు.

జాతర నిర్వాహణలో అధికారులు సమన్వయం పాటించాలి

- **ఎస్టీపీపీలో సమావేశమైన అధికారులు**



నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని వేలాలలో మూడు రోజుల పాటు జరుపుకునే మల్లిఖార్జున స్వామి జాతర నిర్వాహణలో ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సమన్వయం పాటించాలని మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం ఎస్టీపీపీలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రభుత్వ శాఖలకు చెందిన అదికారులతో సమావేశమయ్యారు. జాతర నిర్వాహణలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయడం కోసం అందరు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, ఎస్టీపీపీ డీజీఎం తుకారాం, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపురావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా తలారి రాజు

నవతెలంగాణ-నస్పూర్



షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా తలారి రాజును ఎన్నుకున్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం తలారి రాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె నర్సింగ్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రభుత్వం ఎస్సీ లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులను కేటాయించాలని అన్నారు. నిరుద్యోగులైన ఎస్సీ షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఎస్సీ వర్గీకరణ వెంటనే ఉపసంహరించుకోవాలని వారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నియోజక వర్గం అధ్యక్షుడిగా గుమ్మడి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడిగా శీలం రంజిత్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె నర్సింగ్ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుట్ట రవి, చెవుల వాసు, తరాల విజయ్, చీమల రజలింగు, సోగల రాములు, సొల్లు కొమురయ్య పాల్గొన్నారు.

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై గైర్హాజరు ఉద్యోగులకు మంగళవారం గని మేనేజర్ లక్ష్మీ నారాయణ కౌన్సిలింగ్ ఇచ్చారు. అండర్ గ్రౌండ్ ఉద్యోగులు 16 కన్న తక్కువ మాస్టర్లు, సర్ఫేస్ ఉద్యోగులు 20 మాస్టర్లు కన్న తక్కువ డ్యూటీలు చేసిన ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. గైర్హాజరు వల్ల కంపెనీకి, ఉద్యోగుల కుటుంబాలకు జరిగే నష్టాన్ని ఉద్యోగులకు గని మేనేజర్ వివరించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, గని పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

యంత్రాల వినియోగంతో పంటల సాగు



నవతెలంగాణ-జన్నారం

యంత్రాల వినియోగంతో పంటల సాగు సులువు అవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పలు గ్రామాల రైతులకు వ్యవసాయంలో యాంత్రీకరణపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. రైతులు యంత్రాల వినియోగంపై ఆసక్తిని పెంచుకుని లాభాలు పొందాలని సూచించారు. పలు క్లస్టర్ల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు ఉపకరణాలు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలో అర్హులైన దివ్యాంగులకు బుధవారం ఉపకరణాలు అందించనున్నట్టు సీడీపీఓ స్వరూప రాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ శాఖ, మహిళ శిశ, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సింగరేణి కళావేదికలో శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరానికి బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, మందమర్రి రూరల్, అర్బన్ ప్రాంతాల దివ్యాంగులు హాజరుకావాలని పేర్కొన్నారు. పరీక్షలు చేసి అర్హత కలిగిన దివ్యాంగులకు సహాయ ఉపకర ణాలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక పట్టివేత

నవతెలంగాణ-జైనథ్



అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై వీ.పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెన్ గంగానది గ్రామ శివారులో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు సీఐడీ సాయినాథ్ ఆధ్వర్యంలో ఎస్సై పురుషోత్తం, ఏఎస్సై ఆత్మారాం, పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నవతెలంగాణ-జైపూర్



మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం చెన్నూర్ పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న బోజన కార్మికులకు రూ.10 వేల నెల సరి జీతం చెల్లించాలని అన్నారు. అదేవిధంగా పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాల్లు మౌనిక, ముజిత, సుక్కమ్మ, ఈశ్వరి పాల్గొన్నారు.

ఇటిక్యాలలో ఇండ్లలో దొంగతనం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

మున్సిపాలిటీ పరిధి ఇటిక్యాలలో రెండు ఇండ్లలో దొంగతనం జరిగినట్లు ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కాంద్రపు ప్రసాద్ అనే వ్యక్తి ఈనెల 13వ తారీఖున ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొటి, బీరువాలో ఉన్న చెవికమ్మలు దోచుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన వేముల రామయ్య సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి పనికి వెళ్లాడు. ఎవరు లేకపోవడంతో దొంగలు చొరబడి ఇంట్లోని రూ.45వేల బంగారు చైన్ దొచుకెళ్లారు. బాధితుల్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర సహాయ మంత్రి, ఎమ్మెల్సీ అభ్యర్థికి ఘన స్వాగతం



నవతెలంగాణ-జైపూర్

బీజేపీ ఎమ్మెల్సీ అవగాహన సదస్సులో భాగంగా జైపూర్ మండలం ఇందారం గ్రామానికి వచ్చిన ఆ పార్టీ కేంద్ర హెూంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్న మైల్ అభ్యర్థి అంజిరెడ్డికి జిల్లా నాయకుడు ఘన స్వాగతం పలికారు. గోదావరిఖని నుండి రాజీవ్ రహదారి మీదుగా వచ్చిన నాయకులకు మంగళవారం ఇందారం గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రవెల్లి రఘునందన్, జిల్లా అధ్యక్షుడు నాగునూరి వెంకటేశ్వర గౌడ్, చెన్నూర్ నాయకులు దుర్గం అశోక్, జైపూర్ మండల అధ్యక్షుడు దూట రాజ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-రెంజల్

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, అలాగే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఏసిపి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యా బోధన అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 25 సంవత్సరాలలోపు కష్టపడి చదివిన వారందరికీ మిగతా 75 సంవత్సరాలు ఆనందంగా గడిపే అవకాశం దొరుకుతుందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారిస్తూ తమ పిల్లలను చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమాజంలో ప్రభుత్వ పాఠశాలలోని చదివిన అనేకమంది ప్రస్తుతం ప్రభుత్వ కొలువుల్లో ఉన్నారని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులను సాధించి పాఠశాలకు, తమ గ్రామానికి ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ.శంకర్, రెంజల్ ఎస్ఐ ఈ.సాయన్న, పిఆర్‌టియు మండలాధ్యక్షులు టి.సోమలింగం గౌడ్, ఉపాధ్యాయులు శ్రీరామ్, శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సాయిబాబా, గులాం హైమద్, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతోపాటు విజ్ఞానం అవసరం

నవతెలంగాణ-భిక్కనూర్

విద్యార్థులకు చదువుతోపాటు విజ్ఞానం అవసరమని ఎంఈఓ, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజా గంగారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణ కేంద్రంలో గల బాలికల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా ఎక్స్పోజర్ విజిట్‌గా హైదరాబాద్ పట్టణంలోని జూపార్క్, సాలార్జంగ్ మ్యూజియం, బిర్లా మందిర్, ఇతర ప్రాంతాలను సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థుల మేధస్సును పెంపొందించడానికి విజ్ఞాన విహారయాత్రలు విద్యార్థులకు అవసరమన్నారు. ఈ విహారయాత్రలకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త పురాం రాజమౌళి అన్నారు. సోమవారం రాత్రి పట్టణ కేంద్రంలోని నగరేశ్వర ఆలయంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు రాజమౌళి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి వెంకటేశం, సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రతి ఒక్క ఆర్యవైశ్యులు సంఘం అభివృద్ధి చేయడానికి సహకరించాలని ఎన్నికైన సభ్యులు సూచించారు. అనంతరం ప్రముఖులు ఎన్నికైన సభ్యులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, తదితరులున్నారు.

వాహనాలతో పాటు సరైన ధ్రువపత్రాలు ఉండాలి

నవతెలంగాణ-కామారెడ్డి

వాహనాలతో పాటు సరైన ధ్రువపత్రాలు ఉండాలని మాచారెడ్డి ఎస్సై అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం మాచారెడ్డి మండలంలోని సిరిసిల్ల రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహన దారులకు జరిమానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాచారెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేయాలి

- ముదిగుంట జీపీని సందర్శించిన డీపీఓ



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ పరిధిలో నూటికి నూరు శాతం ఇంటి పన్ను వసూళ్ల పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. మంగళవారం ముదిగుంట గ్రామ పంచాయతీని సందర్శించారు. పారిశుధ్య పనులను పరిశీలించి తడి-పొడి చెత్తను చెత్త వేరువేరుగా సేకరించాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు ఇతర వ్యర్థాలు ఎక్కడ కూడా కన్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించడంతో పాటు ఎప్పటికప్పుడు రికార్డులు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వాటర్ అండ్ శానిటేషన్‌కు సంబంధించిన రిజిష్టరుల్లు పరిశీలించారు. నర్సరీ నిర్వాహణ తీరును, మొక్కల ఎగుదులపై సూచనలు చేశారు. సెగ్రిగేషన్ షెడ్‌లో తయారైన ఎరువులను నర్సరీ మొక్కలకు వినియోగించాలని తెలిపారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కెరమెరి



సైబర్ నేరాలపై ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గుంపుల విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని చందుగూడ కాలనీ ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. అదే విధంగా వాహనదారులు వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అతివేగంగా, మద్యం తాగి, ఫోన్లో మాట్లాడుతూ వాహనం నడపవద్దన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాల పెరిగిపోయాయని వాటి బారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు అత్యవసర సమయంలో డయల్ 100ను లేదా పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. అంతకుముందు కళాజాత బందం సభ్యులు ఆటపాటలతో అవగాహన కల్పించారు. ఈ కళ జాత బందం సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు మండలాల ప్రజలకు అటవీ ఆంక్షలు ఎత్తివేత



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ అభయారణ్యంలోని అటవీ చెక్ పోస్టు ద్వారా 5 మండలాల ప్రజలకు ఆంక్షలు ఎత్తివేయడం జరిగిందని జన్నారం మండలం ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. ఎఫ్‌డీపీటీ శాంతారామ్ ఆదేశాల మేరకు జన్నారం డివిజన్‌లోని దండేపల్లి, జన్నారం, ఖానాపూర్ డివిజన్‌లోని కడెం, దస్తురాబాద్, ఉట్నూర్ డివిజన్‌లోని ఉట్నూర్ మండలాల ప్రజలు ఇంధన్‌పల్లి చెక్ పోస్టు మీదుగా 24 గంటలు ప్రయాణించడానికి అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల ప్రజలు వాహనాలకు ఎలాంటి సెస్ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అటవీ శాఖ అధికారులను ఇబ్బందులకు గురి చేయకుండా ధ్రువీకరణ పత్రాన్ని చూపించి వెళ్లాలని సూచించారు. ప్రజలు వాహన దారులు నిబంధనలు పాటించాలన్నారు.

ఆహార కల్తీపై వినియోగదారులు చైతన్యం కావాలి

నవతెలంగాణ-బోధన్

ఆహార కల్తీ జరగకుండా కల్తీ ఆహారాన్ని గుర్తించేలా వినియోగదారులు చైతన్యం కావాలని వినియోగదారుల మండలి జాతీయ కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని 18వ వార్డులో గల అంగన్వాడీ కేంద్రంలో ఆహార కల్తీ- అయోడిన్ ఉప్పులో ప్లాస్టిక్ అంశం అనే దానిపై వినియోగదారుల చైతన్య సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఆహార కల్తీ మహమ్మారి రోజురోజుకు విజృంభిస్తున్న క్రమంలో వినియోగదారులు చైతన్యవంతులు కావాలని అన్నారు. ఉప్పు, పప్పులు, వంటనూనెలు మొదలుకొని వివిధ రకాల అయోడిన్ ఉప్పులు ప్లాస్టిక్ సంచుల్లో అమ్మకం జరుగుతున్నందున మైక్రో ప్లాస్టిక్ కడుపులోకి చేరడంతో జనం క్యాన్సర్ బారిన పడుతున్నారని అన్నారు. ప్లాస్టిక్ ప్యాకింగ్ వలన అయోడిన్ ఉప్పు లక్ష్యం వృథా అయిపోతున్నదని, కాబట్టి అన్ని రకాల ఉప్పు తయారీ దారులు ప్లాస్టిక్ కవర్‌లలో ప్యాకింగ్ చేయవద్దని తెలిపారు. ఆహార భద్రతా ప్రమాణాల చట్టం 2013 నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలను ఒక వేళ ప్యాకింగ్‌లో చేస్తే, ఆ ప్లాస్టిక్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాలు ప్యాకింగ్‌పై ముద్రించాలని తెలిపారు. కాని వివిధ రకాల అయోడిన్ ఉప్పు తయారీ సంస్థలు నాసిరకం ప్లాస్టిక్ కవర్‌లలో ఉప్పు ప్యాకింగ్ చేసి, చిన్న పిల్లలతో సహ అందరికీ క్యాన్సర్ రావడానికి కారణం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ జానకి, జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు వి.యస్.వర్మ, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, బోధన్ అధ్యక్ష, కార్యదర్శులు మరోజు సుధాకర్ చారి, సల్లుర్వార్ అశోక్‌చారి, రూరల్ ఇంచార్జీ కార్యదర్శులు యాటకర్ల దేవేష్, గైని రత్నాకర్, మహాదేవుని శ్రీనివాస్, సూపర్వైజర్ రాధికా, అంగన్వాడీ టీచర్ సరోజ, అంగన్వాడీ హెల్పర్స్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వజ్రకండి పాఠశాలకు మొదటి బహుమతి

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని వజ్రకండి ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు పర్యావరణంపై ఉత్తమ ప్రదర్శన చేయడంతో మొదటి బహుమతి లభించింది. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. మంగళవారం కౌలాస్ పాఠశాలలో బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వజ్రకండి ఎంపీపీ హెచ్ఎం బాబు, చంద్రకాంత్, వారి కృషి వలన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జుక్కల్ ఎంఈఓ తిరుపతయ్య మాట్లాడుతూ.. జుక్కల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థుల ప్రతిభను చాటేందుకు ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన పెంపొందించామని తెలిపారు. మంచి అవకాశాలు మెండుగా ఉంటాయని, వారికి రాబోయే రోజుల్లో మంచి పరిజ్ఞానం పొందగలుగుతారని అన్నారు. అనంతరం హెచ్ఎం బాబు మాట్లాడుతూ.. తమ పాఠశాలకు సంబంధించిన లక్ష్మి, ద్వారక, శివాని ముగ్గురు విద్యార్థులు పర్యావరణ మోడల్‌లో బహుమతులను అందుకోవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం శోభ, యశ్పాల్, గోపాల్, శ్రీనివాస్, చంద్రకాంత్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేటలో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు వినతి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రంగంపేటలో రైల్వే స్టేషన్ ఏర్పాటు కోసం మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్ రెడ్డి మంగళవారం స్థానిక ఎంపీ సురేష్ షెట్కర్‌ను కలిశారు. ఎంపీ రంగంపేటలో రైల్వే స్టేషన్ ఏర్పాటు కోసం వారికి లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంగంపేటలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తే పోసానిపేటతో పాటు గొల్లపల్లి, మోషన్‌పూర్, మర్కల్, గర్గుల్, ఇస్రాజివాడి గ్రామాల రైతులకు, విద్యార్థులకు రైల్వే సౌకర్యాలు అందుతాయని అన్నారు. లెటర్‌ను రైల్వే ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

గ్రామస్తుల సమక్షంలో స్థలాన్ని ఎంపిక చేస్తాం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని వాడి గ్రామంలో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని గ్రామస్తులందరం కలిసి తీర్మానం చేస్తామని వాడి గ్రామస్తులు మంగళవారం తహసిల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. అధికారులు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు స్థలాన్ని ఎంపిక చేశారని, అక్కడ కాకుండా గ్రామస్తులందరం కలిసి నిర్ణయించిన స్థలంలో విగ్రహం ఏర్పాటు చేయాలని వారు పేర్కొన్నారు. వినతిపత్రాన్ని తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై మల్లారెడ్డి, ఎల్లారెడ్డి ఆర్‌డిఓ ప్రభాకర్‌కు అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

నవతెలంగాణ-బోధన్

పాఠశాల స్థాయి నుంచి సమాజంలో ఉన్నత స్థాయిలో ఎదిగేలా విద్యార్థులను తయారుచేసే వారే ఉపాధ్యాయులని పెంటాకలాన్ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం నర్సడిగల్ల అబ్బయ్య అన్నారు. మంగళవారం పెంటాకలాన్‌లో జడ్పీహైస్కూల్ వార్షికోత్సం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధిలో భాగంగా సహకరిస్తున్న గ్రామ పెద్దల సేవలను, ఉపాధ్యాయుల సేవలను మరువలేమని అన్నారు. దాతల సహకారంతో పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం, ఉపాధ్యాయుల సౌకర్యార్థం టాయిలెట్‌లు నిర్మించినట్లు తెలిపారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేశామన్నారు. అనంతరం బర్దిపూర్‌కు చెందిన స్వర్గీయ సుంకరి లింగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మనోహర్, కూతురు నవనీత, అల్లుడు రాజు పాఠశాల విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను అలరించాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లస్మయ్య ఉపాధ్యాయులు పాటల శ్రీనివాస్, విద్యాకమిటీ చైర్మెన్ పద్మావతి గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పశువుల పాకలు నిర్మించుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా మంజూరు అవుతున్న పశువుల పాకలు నిర్మించుకోవాలని ఎంపిడీఓ పదుసూదన్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పొలంపల్లి గ్రామాన్ని ఎంపీడీఓ సదర్శించారు. ఆ గ్రామానికి చెందిన రైతు నక్క రమేష్ నిర్మించుకున్న పశువుల పాకను పరిశీలించి ఆయన అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.

20న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

నవతెలంగాణ-లక్సెట్టిపేట

జిల్లా సంక్షేమ శాఖ, ఆలింకో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో లక్సెట్టిపేట పట్టణంలో దివ్యాంగులకు సహాయ ఉపకారణాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్ యార్డు సమీపంలోని రైతు వేదిక వద్ద ఉపకరణాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డులు, ఆదాయం సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

కాలేయ వ్యాధి స్క్రీనింగ్ టెస్టులను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ బోధన్ డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన బోధన్ పట్టణంలోని దయానంద గోశాలలో ఉచితంగా కాలేయ వ్యాధి స్క్రీనింగ్ టెస్టు శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి మదన్ మోహన్, వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అద్దంకి ఊషన్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలేయ వ్యాధి స్క్రీనింగ్ టెస్ట్ కోసం ప్రైవేట్ హాస్పిటల్లో రూ.5000 ఫీజు వసూలు చేస్తున్న ఈ రోజులలో రోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దనే కారణంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తుందని తెలిపారు. అలాగే ఉచితంగా స్కానింగ్ చేసి, మందులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కావున రోగులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9959224984, 7702557778, 9848825209, 9492474616 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ-గాంధారి/లింగంపేట్

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు వివరించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సాయికుమార్, గాంధారి మాజీ సర్పంచ్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కామెల్లి బాల్‌రాజు, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు తాడ్వాయి సంతోష్, వజీర్ ముకుంద్‌రావు, సీతాయిపల్లి శ్రీను, కుమ్మరి రాములు, సంగని బాబా, మదర్, నితీన్, గడ శంకర్, బషీర్, మమ్మాయి నర్సింలు, దేమేశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్జల్‌లో ప్రచారం..

మండలంలోని గుర్జల్ గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మొదటి ప్రాధాన్యత ఇచ్చి నరేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో యూత్ మండలాధ్యక్షులు బిస గణేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సంగని బాబా, భాస్కర్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వినయ్, గ్రామ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు శ్రీను, గంగారాం, రాజు, ఉమెర్ తదితరులు పాల్గొన్నారు.

చదువులో రాణిస్తేనే ఉద్యోగాలు

నవతెలంగాణ-గాంధారి

చదువులో రాణిస్తేనే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చునని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కళాశాల వార్షికోత్సవం స్పోర్ట్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాబోవు మార్చి పరీక్షల్లో బాగా చదువుకొని ఉత్తీర్ణశాతం పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ అధ్యాపకులు జెట్టి విజయకుమార్ వారి తండ్రి జట్టి నారాయణ జ్ఞాపకార్థం కళాశాలలో 868 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన అంకిత తల్లిదండ్రులకు 3వేల నగదుతో పాటు బహుమతులు అందజేశారు. అలాగే కెమిస్ట్రీలో 60కి 60 మార్కులు సాధించిన రాంజీ, శివానీ ఇద్దరికి రూ.500 చొప్పున అందజేశారు. ఫిజిక్స్ లెక్చరర్ సరిత మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన అశోక్‌కు రూ.1000, రెండో సంవత్సరం టాపర్ అంకితకు రూ.1000 నగదును ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు డాన్సులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం ఆటల పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రిన్సిపాల్ అధ్యాపకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజగోపాల్, లక్ష్మణ్, శ్రీధర్, రమేష్, వెంకటస్వామి, సరిత, సుజాత, స్వప్న, రాజ్ కుమార్, అంజలి, గణేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివానగర్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్ తండ్రి ఇటీవల మృతి చెందగా వారిని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, మాజీ వైస్ ఎంపిపిలు గాదారి శ్రీనివాస్‌రెడ్డి, రూపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని కరేగాం గ్రామ మంజీరా నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారని ఎస్ఐ సందీప్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.